క్లుప్తంగా

'ప్రజలకు వాస్తవాలు తెలుసు'

రణస్థలం: టీడీపీ నాయకుడు పట్టాభిని కొట్టినట్లు 2021 నాటి ఫొటోలు తీసుకువచ్చి ఈనాడు పత్రికలో తప్పుడు వార్తను ప్రచురించడాన్ని నిరసిస్తూ గురువారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో ఈనాడు పేపర్లను వైఎస్సార్ సీపీ శ్రేణుల సమక్షంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిరణ్ మాట్లాడుతూ నిరాధారమైన వార్తలతో జర్నలిజానికి మాయని మచ్చలా ఉన్న ఎల్లోమీడియా పత్రికలను పాఠకులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. పట్టాభి పాత ఫొటోలు ప్రచురించి తప్పుడు సంకేతాలు పంపించినా ప్రజలకు వాస్తవాలు తెలుసని చెప్పారు. సీఎం జగన్ మోహన్ రెడ్డి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు, అనేక నూతన పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నా ఎల్లోమీడియాకు అటువంటి మంచి కనిపించదని దుయ్యబట్టారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మైలపల్లి కామరాజు, దేశెట్టి తిరుపతిరావు, అల్లు కన్నబాబు, జక్కంపూడి అచ్చిబాబు, కలిశెట్టి భాస్కరరావు, గురాన ప్రసాద్, కిల్లారి సూర్యనారాయణ, కలిశెట్టి కన్నంనాయుడు, దన్నాన సీతారాం, టేకి బ్రహ్మాజీ, చుక్క రమణ, రెడ్డి దాలినాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

లావేరు: మండలంలోని అన్ని గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ ఎస్.బయ్యన్ననాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. చిలకపాలెంలోని 132–33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు నేపథ్యంలో సరఫరా ఉండదన్నారు.

మొక్కలతోనే మానవాళి మనుగడ



మొక్కలు నాటుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కుమార్‌రాజు

లావేరు: మానవాళి మనుగడకు మొక్కలు ఎంతగానో దోహదపడతాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి.కుమార్‌రాజ్ అన్నారు. మురపాక శాఖా గ్రంథాలయాన్ని గురువారం సందర్శించి రికార్డులు పరిశీలించారు. గ్రంథాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ శ్రీనివాసరావు, సహాయకుడు పి.షణ్ముఖరావు పాల్గొన్నారు.

26న గీతాపఠన పోటీలు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 26న ఉదయం 10 గంటలకు చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి గీతా పఠన పోటీలు నిర్వహిస్తామని నిర్వాహకులు చిన్మయానంద తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ఉపాధి పనులు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: ఎస్ఎస్ఆర్ పురం పంచాయతీ చినరావుపల్లిలో గురువారం ఉపాధి హామీ పథకం పనులను వైఎస్సార్‌సీపీ నాయకులు దుంప చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్‌కార్డు కలిగిన వారంతా పనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గరిష్ట వేతనం రూ.250 వచ్చేలా పనిచేయించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో స్థానికులు నాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

అటెండర్ సమస్య పరిష్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆరు నెలలుగా బీసీ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అటెండర్ పైడి లక్ష్మి సమస్య గురువారం ఎట్టకేలకు పరిష్కారమైంది. కింతలి బీసీ సంక్షేమ వసతి గృహంలో అటెండర్‌గా పనిచేసిన లక్ష్మిని ఆరు నెలల క్రితం అభియోగాలపై సస్పెండ్ చేశారు. ఆమె కలెక్టర్‌కు మొరపెట్టుకోవడంతో రెండు నెలల్లోనే సస్పెన్షన్ ఎత్తివేశారు. తర్వాత పోస్టింగ్‌కు కలెక్టర్ ఆదేశాలు చేసినా అమలుకాకపోవడంతో లక్ష్మి ఎన్జీవో సంఘం నాయకులను ఆశ్రయించారు. సంఘ ప్రతినిధులు బీసీ సంక్షేమాధికారితో మాట్లాడుతూ ఉత్తర్వులు అమలు చేయకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పడంతో గురువారం ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు.

సమాజసేవలో రోటరీ క్లబ్



మాట్లాడుతున్న కింతలి నాగేశ్వరరావు

శ్రీకాకుళం అర్బన్: సమాజసేవలో రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఎప్పుడూ ముందుంటుందని క్లబ్ అధ్యక్షుడు కింతలి నాగేశ్వరరావు అన్నారు. గురువారం రోటరీక్లబ్ 118వ వార్షికోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, రోటరీ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్‌వో ప్లాంట్, టైలరింగ్, మగ్గంవర్క్‌లో ఉచిత శిక్షణ వంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, వరదా కొండబాబు, ఎస్.శరత్‌కుమార్, కె.సుజాత, వి.మహాలక్ష్మి, ఎస్.నరసింహమూర్తి, కె.టి.నాయుడు, జె.వెంకుబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఠాగూర్ స్కూల్‌లో జూనియర్ రెడ్‌క్రాస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రథమ చికిత్సపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది కె.సత్యనారాయణ, ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దిగుబడి భళా.. ధర డీలా!

- గిట్టుబాటు ధర లేక ఉల్లి రైతుల ఇక్కట్లు
- వ్యాపారులు సిండికేట్ అవుతున్నారని ఆవేదన

లావేరు:

వ్యాపారులు సిండికేట్‌గా మారడంతో నష్టాలు వస్తున్నాయని ఉల్లి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దిగుబడులు బాగున్నా గిట్టుబాటు ధర లేక ఇబ్బందిపడాల్సి వస్తోందని వాపోతున్నారు. లావేరు మండలంలోని లావేటిపాలెం, కేశవరాయునిపురం, లావేరు, జీజీవలస, అప్పాపురం, రామునిపాలెం, గోవిందపురం, వెంకటాపురం తదితర గ్రామాల్లో ఈ ఏడాది అధిక విస్తీర్ణంలో ఉల్లిపంటను సాగుచేశారు. పంట కోత దశకు రావడంతో ఉల్లి పాయలు తీసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఉల్లి పంటకు మొదట్లో కిలో రూ.30పైబడి ధర ఉండటంతో లాభదాయకంగా ఉంటుందని భావించి అధిక సంఖ్యలో రైతులు పంటను సాగు చేశారు. పంట చేతికందే సమయానికి కిలో రూ.20 అయినా ఉంటుందని రైతులు భావించారు. తీరా పండిన సమయానికి వ్యాపారులు కిలోకు రూ.10 మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. బయట మాత్రం అధిక ధరలకు విక్రయిస్తూ తమకు మాత్రం అరకొరగా డబ్బులిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉల్లి వ్యాపారులు సిండికేట్‌గా మారి మద్దతు ధర లేకుండా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ ఏడాది మంచి ధర ఉంటుందని భావించి ఇతర ప్రాంతాలకు వెళ్లి మరీ వేలాది రూపాయలు పెట్టి ఉల్లినారు తెచ్చి సాగు చేశామని, తీరా ఇప్పుడు ధర రూ.10కు పడిపోవడంతో పెట్టుబడులు కూడా రావడం లేదని చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ధాన్యం, మొక్కజొన్న పంటల తరహాలో ఉల్లి పంటను కూడా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



కేశవరాయునిపురంలో అమ్మకానికి సిద్ధం చేసిన ఉల్లిపాయలు

సిండికేట్ వల్లే..



పంట లేనప్పుడు ఉల్లి కిలో రూ.30 వరకూ ఉండేది. పంట చేతికందే సమయానికి వ్యాపారులు రూ.10 మాత్రమే చెల్లిస్తున్నారు. షాపుల్లో మాత్రం అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

– పల్లంటి రమణ, రైతు, పిడుగుపాలెం, లావేరు మండలం

ప్రభుత్వమే కొనాలి..



ఉల్లి పంటను సాగు చేయడానికి వేలల్లో ఖర్చయ్యింది. ఇప్పుడు ధర ఒక్కసారిగా రూ.10కు పడిపోయింది. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు. ప్రభుత్వమే పంట కొనుగోలు చేయాలి.

– లంకలపల్లి సూర్యారావు, రైతు, కేశవరాయునిపురం, లావేరు మండలం

విజయమే లక్ష్యం

శ్రీకాకుళం రూరల్/శ్రీకాకుళం పీఎన్‌కాలనీ: రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావును జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్, డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు చింతాడ వరుణ్‌లు పెదపాడులోని క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మాన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.



మంత్రి ధర్మానతో ఎం.వి.స్వరూప్, చింతాడ వరుణ్

సీఎంకు కృతజ్ఞతలు..

యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించి రాష్ట్రంలో ఉద్యోగ విప్లవం సృష్టించారు. సచివాలయ ఉద్యోగాలతో ఎంతోమంది యువతకు బంగారు భవిష్యత్‌నిచ్చారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షులుగా అవకాశం కల్పించినందుకు సీఎంకు కృతజ్ఞతలు. గ్రామస్థాయిలో యువజన విభాగం అధ్యక్షుల్ని నియమిస్తాం. ప్రభుత్వం అందిస్తున్న కార్యక్రమాలు యువత సాయంతో ప్రజలకు తెలియజేస్తాం. ఈ అవకాశం కల్పించినందుకు మంత్రులు ధర్మాన ప్రసాదరావు, బొత్స సత్యన్నారాయణలకు కృతజ్ఞతలు.

– ఎం.వి.స్వరూప్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు

మరింత బలోపేతం చేస్తాం

రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాలకు అనేక రకాల పదవులు అందించి తగిన గుర్తింపునిచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కలకాలం సీఎంగా ఉంటారు. డాక్టర్స్ సెల్ అధ్యక్షునిగా అవకాశం ఇచ్చినందుకు సీఎం, స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి ధర్మాన ప్రసాదరావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌లకు కృతజ్ఞతలు. వైద్యరంగంలో నావంతుగా ప్రజలకు సేవలందిస్తా. పార్టీని మరింత బలోపేతం చేస్తాం.

– డాక్టర్ చింతాడ వరుణ్, వైఎస్సార్ సీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు

రైతు సమస్యల పరిష్కారానికి..



జిల్లా రైతాంగం విభాగం అధ్యక్షునిగా ఎంపిక చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, రాష్ట్రరెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావుకు, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్‌కు కృతజ్ఞతలు. ప్రభుత్వం అందజేస్తున్న పథకాలు, సబ్సిడీలు, రైతు భరోసా కేంద్రాలు ద్వారా రైతులకు అందుతున్న పథకాలపై విస్తృత ప్రచారం చేస్తాం. రైతులకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటాను.

– అంబటి శ్రీనివాసరావు, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు

క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 18 మంది ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళంలోని కాకినాడ శ్రీ ఆదిత్య డిగ్రీ(కో ఎడ్యుకేషన్) కళాశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ విప్రో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ ఎస్.వి.వేణుగోపాల్ తెలిపారు. గురువారం నిర్వహించిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం వివిధ కంపెనీలు నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 250 మంది ఉద్యోగాలు పొందారని గుర్తుచేశారు. అందులో అత్యధికంగా ఇన్ఫోసిస్ కంపెనీకి 196 మంది తమ కళాశాల నుంచే ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎస్.శేషారెడ్డి, సెక్రటరీ సుగుణారెడ్డి, అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, శ్రీకాకుళం జిల్లా డైరెక్టర్ బీఎస్ చక్రవర్తి తదితరులు అభినందించారు.



విప్రోకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల ప్రతినిధులు, సిబ్బంది

సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలి

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో పోటీచేస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి గెలిపించాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. తమ్మినాయుడుపేట, ఇబ్రహింబాద్ గ్రామాల్లో గురువారం పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. అన్నివర్గాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు.

రాష్ట్ర భవిష్యత్తు కోసం వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థికి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉమెన్ ఫైనాన్స్ కార్పొ రేషన్ చైర్‌పర్సన్, ఎచ్చెర్ల జెడ్పీటీసీ బల్లాడ హేమమాలినీరెడ్డి, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి జరుగుళ్ల శంకరరావు, ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు, జేసీఎస్ ఇన్‌చార్జి మూగి శ్రీరాములు, మాజీ ఎంపీపీ బల్లాడ జనార్దన రెడ్డి, నాయకులు బోర సాయిరాం రెడ్డి, సూర అప్పా రావు, పంచిరెడ్డి రాంబాబు, ముద్దాడ శంకరరావు, గుండ రవి, దుంప చిన్నారెడ్డి, జరుగుళ్ల కృష్ణారావు, అంబటి శ్రీనివాసరావు, వావిలపల్లి రామారావు, పంచాది నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: అద్వాన్నంపేటలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కిరణ్



ఎచ్చెర్ల క్యాంపస్: తమ్మినాయుడుపేటలో ఓటర్‌కు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

సైనికుల్లా పని చేయాలి..

జి.సిగడాం: శాసనమండలి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నిద్దాం, అద్వానంపేట గ్రామాల్లో పర్యటించి కార్యకర్తలతో మాట్లాడారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ సీతంరాజు సుధాకర్ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఆయనతోపాటు మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, వైస్ ఎంపీపీ మీసాల సాధ్వీమణి, పీఏసీఎస్ చైర్మన్ ఏర్నేన ప్రకాశరావు, మీసాల సీతారాం, విశ్రాంత వైద్యులు మీసాల రాంబాబు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

జి.సిగడాం: పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయని ఏపీటీఎఫ్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి మక్క గంగేశ్వరి పిలుపునిచ్చారు. గురువారం జి.సిగడాం, పొందూరు మండలాల ఉపాధ్యాయులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ డీఏలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేసి సర్వీసును రెగ్యులర్ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు మజ్జి మదన్‌మోహన్, మండలశాఖ అధ్యక్షుడు కాయల రమేష్, జిల్లా కౌన్సిలర్ బొడ్డేపల్లి రమణమూర్తి, పిట్ట అప్పారావు, దుంగ వీరయ్యలతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రణస్థలం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ దశల వారీగా పోరాటాలను ఉధృతం చేస్తోందని జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్మోహన్ అన్నారు. రణస్థలం, లావేరు మండలాల ఏపీటీఎఫ్ కార్యకర్తలతో రణస్థలం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రణస్థలం, లావేరు మండలాల అధ్యక్ష కార్యదర్శులు బొంతు అప్పలనాయుడు, సీహెచ్ కోటేశ్వరరావు, బి.జగదీశ్వరరావు, ఎం.భుజంగరావు, టి.వి జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.



జి.సిగడాం: మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి గంగేశ్వరి



రణస్థలం: తహసీల్దార్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

12 గ్రామాల్లో సమగ్ర భూముల సర్వే పూర్తి

లావేరు: మండలంలోని 12 రెవెన్యూ గ్రామాల్లో సమగ్ర భూముల సర్వే పూర్తయ్యిందని తహసీల్దార్ ఎస్.దిలీప్ చక్రవర్తి అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సమగ్ర భూముల సర్వేపై మండల సర్వేయర్ బి.శ్రీధర్‌రెడ్డితో సమీక్షించి ఆన్‌లైన్‌లో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేణుగోపాలపురం, శీర్లపాలేం, సుభద్రాపురం, జీజీవలస, కేశవరాయునిపురం, నాగంపాలెం, గోవిందపురం, భరిణికాం, పెదలింగాలవలస, కొండకుంకాం, సీహెచ్ అగ్రహారం, వెంకటరావుపేట గ్రామాల్లో భూముల సర్వే పూర్తయ్యిందని చెప్పారు. శిగురుకొత్తపల్లి, పోతయ్యవలస, రావివలస, లోపెంట, నీలాపురం, బుడతవలస గ్రామాల్లో సర్వే చివరి దశకు చేరుకుందన్నారు. కేశవరాయునిపురం మినహా మిగతా 11 గ్రామాల్లో రైతులకు కొత్తగా మంజూరు చేసిన పట్టాదారు పాస్‌పుస్తకాలు పంపిణీ చేశామన్నారు. గతంలో పట్టాదారు పాస్ పుస్తకాల్లో ఖాతా నంబరు, సర్వే నంబరు, భూమి విస్తీర్ణం వివరాలు మాత్రమే ఉండేవని, కొత్త పుస్తకాల్లో ఎల్‌పీఎం నంబరుతో సహా హద్దులు తెలుపుతూ స్కెచ్ కూడా ఉన్నట్లు తెలిపారు. గ్రామాల్లో చెరువు గర్భాలు, రస్తాల్లో గతంలో డీపట్టాలు ఇచ్చినా అవి చెల్లవని, సర్వే పూర్తయిన గ్రామాల్లో వాటి వివరాలను పాస్ పుస్తకాల్లో నమోదు చేయలేదన్నారు. ఈ ఏడాది డిసెంబరు నాటికి అన్ని రెవెన్యూ గ్రామాల్లో సర్వే చేస్తామని చెప్పారు.



సర్వే వివరాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ దిలీప్‌చక్రవర్తి

ధ్యానంతో ఒత్తిడి దూరం



ధ్యానం చేస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో మానసిక ఒత్తిడి దూరమై ఏకాగ్రత పెరుగుతుందని పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ మూమెంట్ ప్రతినిధులు బాలాజీరావు, బిందుమాధవి, శివ అన్నారు. నగరంలోని డేఅండ్ నైట్ కూడలి వద్ద సెయింట్ జోసెఫ్ హైస్కూల్‌లో విద్యార్థులకు గురువారం ధ్యానంపై శిక్షణ ఇచ్చారు. రోజూ ధ్యానం చేయడం వల్ల కలిగే లాభాలను వివరించారు.

సేవతోనే సంతృప్తి



వస్త్రాలు పంపిణీ చేస్తున్న దాతలు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): సేవ చేయడంలోనే సంతృప్తి కలుగుతుందని విశ్రాంత ఉపాధ్యాయులు దొంతుకుర్తి త్రినాథరావు దంపతులు అన్నారు. గురువారం నాయీబ్రాహ్మణ కమ్యూనిటీ హాలులో పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్ష కార్యదర్శులు కొరుపూరు గజపతిరావు, ఎస్.వి.జగన్నాథం, కృష్ణారావు, గొలివి శివ, టి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల వితరణ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : వాకర్స్ ఇంటర్నేషనల్ ఆదిత్యా వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ వ్యవస్థాపకులు బగ్గాం ధర్మారావు వర్ధంతి సందర్భంగా గురువారం పాతశ్రీకాకుళం పరిధిలోని నిరుపేదలకు దుప్పట్లు, పంచెలు, చీరలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస్ పట్నాయక్, హరిబాబు, బి.శ్రీనివాసరావు, రాజగోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

గోపూజ శ్రేయస్కరం



గోశాలను సందర్శిస్తున్న శంకర విజయేంద్ర సరస్వతి

శ్రీకాకుళం రూరల్: మునసబుపేటలో గురజాడ ఎడ్యుకేషన్ సొసైటీలోని గోశాలను శంకర విజయేంద్ర సరస్వతి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోమాతను పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. దాన ధర్మాలు చేసి పేదవారికి సాయం చేయడం వల్ల ముక్తి కలుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు దంపతులు, ప్రిన్సిపాల్ డాక్టర్ పులఖండం శ్రీనివాసరావు, కరస్పాండెంట్ అంబటి రంగారావు, టీడీపీ నేత గొండు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: ఓపెన్ స్కూల్ ద్వారా ఇంటర్మీడియెట్‌లో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మెట్ట కృష్ణవేణి ఒక ప్రకటనలో తెలిపారు. పది ఉత్తీర్ణులైన వారు, ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతూ వివిధ కారణాలతో చదువు నిలిపివేసిన వారు అర్హులని పేర్కొన్నారు. టెన్త్ ఒరిజినల్ పాస్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్, కుల ధ్రువీకరణ పత్రం, పాస్‌ఫోటోలతో ఈ నెల 27లోగా కళాశాలలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు

శ్రీకాకుళం క్రైమ్ : విద్యార్థినుల వేధిస్తే కఠిన చర్యలు తప్పవని శ్రీకాకుళం రెండో పట్టణ ఎస్ఐ పి.లక్ష్మి హెచ్చరించారు. ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు గురువారం జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులకు మహిళల భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థినుల పట్ల సోదరభావంతో మెలగాలన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడకూడదని, హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం నాటక ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.వి. సత్యనారాయణ, రీసెర్చ్ కోఆర్డినేటర్ డాక్టర్ జయపాల్‌రావు, మహిళా సాధికారిత కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.ప్రమీల, పోలీసులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రెండో పట్టణ ఎస్ఐ పి.లక్ష్మి

విపత్తులు ఎదుర్కోండి

- ప్రమాదాల సమయంలో అందరి సహకారం అవసరం
- ఆర్డీఓ బి.శాంతి


పొందూరు, ఎచ్చెర్ల క్యాంపస్: విపత్తుల సమయంలో ప్రాణనష్టం నివారణకు అందరి సహకారం అవసరమని శ్రీకాకుళం రెవెన్యూ డివిజనల్ అధికారి బి. శాంతి వెల్లడించారు. పరిశ్రమల్లో ప్రమాదాలపై పలు కంపెనీల్లో గురువారం మాక్‌డ్రిల్ నిర్వహించారు చిలకపాలెంలోని నాగార్జున అగ్రికెం లిమిటెడ్‌లో క్లోరిన్ గ్యాస్ లీకేజీ అయితే తీసుకోవాల్సిన చర్యలపై పొందూరు మండలం కేశవదాసుపురం, ఎచ్చెర్ల మండలం అరిణాంఅక్కివలస గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రమాదాలు సంభవించినప్పుడు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా రెవెన్యూ, వైద్య ఆరోగ్య శాఖలు నిరాటంకంగా సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. విపత్తు సంభవించినపుడు ఎలా స్పందించాలో, ఎలా అప్రమత్తం కావాలో మాక్‌డ్రిల్ ద్వారా చూపించారు. జిల్లా అగ్నిమాపక అధికారి వీరభద్రరావు మాట్లాడతూ ఎన్ఏసీఎల్‌లో ప్రమాదం జరిగితే ప్రజలంతా తమవంతు సహకారం అందించి ప్రాణనష్టం నివారణకు సహకరించాలని కోరారు. అనంతరం నిర్వహించిన సమావేశానికి పరిశ్రమలశాఖ సేఫ్టీ అధికారి సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఎన్ఏసీఎల్ ఉపాధ్యక్షుడు శేషగిరిరావు మాట్లాడుతూ మాక్ డ్రిల్ ద్వారా జరగబోయే ప్రమాదాల పట్ల అవగాహన ఉంటుందని, ఇందుకు సహకరించిన అధికారులు, ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. డీఎస్పీ మహేంద్ర, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ శంకర్‌నాయక్, పరిశ్రమలశాఖ మేనేజర్ ఉమామహేశ్వరరావు, జాతీయ విపత్తుల నిర్వహణశాఖ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ పి.రాము, ఎంవీఐ గంగాధర్, ఏఎన్ఏసీఎల్ జనరల్ మేనేజర్ కె.శ్యాంప్రసాద్, డీజీఎం పీఎస్‌వీఎస్ఎన్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ, అధికారులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఎచ్చెర్ల : పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని గ్రంథాలయాధికారి ఎం.చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. ధర్మవరం శాఖా గ్రంథాలయం వద్ద గురువారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలను నాటడంతో సరిపెట్టకుండా వాటి సంరక్షణ బాధ్యత కూడా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు బి.సూర్యనారాయణ పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న లైబ్రేరియన్ చంద్రశేఖరరావు